RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -146 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 3 జులై 2026

# గ్రామీణాభివృద్ధిలో ఆంధ్ర అగ్రగామి

## ఆంధ్రప్రదేశ్ వేదికగా అమలులోకి

**- తొలి కార్యక్రమంగా ఫారం పాండ్ కి శంకుస్థాపన చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**రైల్వే కోడూరు జులై 02 ఆంధ్ర ప్రగతి**
వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్‌చట్టం ఆంధ్రప్రదేశ్ వేదికగా జాతీయ స్థాయిలో అమలులోకి వచ్చింది. తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలోని ముక్కావారిపల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా ఫారం పాండ్ కు శుంకుస్థాపన చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వీబీ జీ రాం జీ చట్టంలో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ప్రజల అభివృద్ధితోపాటు రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని తెలిసేలా ఈ పంట కుంట తవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు. **మిగతా 2లో...**





## గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా నిలుపుతాం

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



భవిష్యత్తు భారతదేశం కేవలం నగరాల అభివృద్ధిలోనే లేదు.. సంపన్నమైన, సమ్మిళిత అభివృద్ధి కలిగిన గ్రామాల్లో ఉంది. గ్రామీణ భారతానికి కొత్త శక్తినిచ్చేలా "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ" (వీబీజీరాంజీ) పథకం నూతనంగా సేవలు అందించనుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, భవిష్యత్తుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎనలేనిది. దేశంలో వి బి జి రామ్ జి నిధుల కేటాయింపులో ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం తృతీయ స్థానం కల్పించడం కేంద్రం అందిస్తున్న సహకారానికి మచ్చుతునక అని అన్నారు.

## పవన్ సారథ్యంలో గ్రామాల రూపురేఖలు మారుస్తాం

**: సీఎం చంద్రబాబు**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చేస్తామని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో సుమారు రూ.11,000 కోట్లకు పైగా నిధులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో 125 రోజుల పనిదినాలు కల్పించి, రహదారులు, డ్రైనేజీలు, కాలువలు వంటి శాశ్వత ఆస్తుల కల్పనకు శ్రీకారం చుడతామని ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ) ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

**అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం**

**పాత నిల్వలు అధిక ధరకు కొన్నందున కంపెనీలకు భారీ నష్టాలు**

**ఇప్పటికే పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ**



2లో.

## సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారు

**ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్**

**పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ**

**విజయవాడజులై 02ఆంధ్ర ప్రగతి**
విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు. **మిగతా 2లో...**



## ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

**భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం -జపాన్ ప్రధాని సనాయె తకాయిచి**

**ఢిల్లీలో మోడీతో ద్వైపాక్షిక సమావేశం -ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు**

**న్యూఢిల్లీ జులై 02ఆంధ్ర ప్రగతి**
భారత్, జపాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడ్డాయి. భారత ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు**మిగతా 2లో...**



# తెలంగాణలో ఉద్రిక్తత

## మాటల యుద్ధంతో వేడెక్కిన రాజకీయం

**అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు**

**గన్‌పార్క్ వద్దకు వచ్చిన మంత్రులు జూపల్లి, : పొన్నం, అడ్లూరి, అజహరుద్దీన్**

**తెలంగాణ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత గన్‌పార్క్‌కు వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం**

**హరీశ్‌రావు సహా పలువురి నాయకుల అరెస్టు**

**హైదరాబాద్‌జులై 02 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో హైదరాబాద్ నగరం అట్టుడికింది. నాయకుల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో గురువారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్ర అప్పు, గురుకుల విద్యాసంస్థల**మిగతా 2లో...**



## ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త

**శ్రీసిటీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్**

**2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ఉద్ఘాటన**

**వర్సిటీ ద్వారా 75 వేల ఉద్యోగాలను సృష్టిస్తామని వెల్లడి**

**పెట్టుబడిదారులకు 3ూ మోడల్‌తో పూర్తి భరోసా ఇస్తున్నామని వివరణ**




2లో.

## వీబీజీరాంజీ లో చేరుతున్నాం

**అభ్యంతరాలపై సుప్రీంకు వెళ్తాం**

**స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం**

**టీచర్లు, సిబ్బందికి కూడా అక్కడే భోజనాలు**

**కొత్త సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులకు ఆమోదం**

**'మూసీ' ఫేజ్‘1కు త్వరలో టెండర్లు.. దానికోసం**

**రూ.7345 కోట్లకు పరిపాలనా అనుమతులు**

**గోదాములు, 'జవహర్ నవోదయ' కోసం భూముల కేటాయింపులు**

**సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు**




2లో.

# గ్రామీణాభివృద్ధిలో ఆంధ్ర అగ్రగామి

**మొదటిపేజీ తరువాయి**

పంచాయతీపాలనలో ఆంధ్రప్రదేశ్ అద్భుత విజయాలు అనంతరం వీబీ జీ రాం జీ పథకం కింద కలప ఉత్పత్తి చేసే టేకు, మద్ది, వేప, యూకలిప్టస్ తదితర 10 రకాల మొక్కలను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు, శ్రీ చంద్రబాబు నాయుడు గారు, శ్రీ పవన్ కళ్యాణ్ గారు, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నాటారు. పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణతోపాటు పంచాయతీల ఆదాయం పెంచేందుకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో కలప ఉత్పత్తి, వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రివర్యులకు తెలియజేశారు. అనంతరం సభా ప్రాంగణానికి సమీపంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్ నమూనాను చూపించి ఆ కాన్సెప్ట్ ను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి వివరించారు. మురుగునీటి నిర్వహణలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న ఆవిష్కరణ అయిన ఈ మ్యాజిక్ డ్రెయిన్ మొత్తం మూడు లేయర్లలో నిర్మాణాన్ని ప్రదర్శించారు. మ్యాజిక్ డ్రెయిన్లలో ఎర్త్ వర్క్, మొదటి



లేయర్ లో 30 సెంటీమీటర్ల మందంతో వేసిన 100 ఎంఎం కంకర, రెండో లేయర్ లో వేసిన 40 ఎంఎం కంకర, మూడో లేయర్ లో వేసిన 20 ఎంఎం కంకరతో నింపనున్నట్టు తెలిపారు. మ్యాజిక్ డ్రెయిన్ పని తీరుని వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాధించిన విజయాల సమాహారంతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని తిలకించారు. మోడల్ పంచాయతీలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీలు, జియో ట్యాగింగ్ వంటి పారదర్శక విధానాలతో సాధించిన ప్రగతిని అతిధులంతా వీక్షించారు. అనంతరం వేదిక మీద ఏర్పాటు చేసిన వీబీ జీ రాంజీ శిలాఫలకాన్ని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు ఆవిష్కరించారు. లబ్దిదారులైన ఉపాధి శ్రామికులకు వీబీ జీ రాం జీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా ఓపీఈడీ బుక్ లెట్ ను ఆవిష్కరించారు. పోర్టల్ ను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేష్ పాశ్వాన్ గారు, సమాచార ప్రసార, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ గారు, రాష్ట్ర మంత్రులు శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు, శ్రీ అనగాని సత్యప్రసాద్ గారు, రైల్వే కోడూరు శాసన సభ్యులు శ్రీ అరవ శ్రీధర్ గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సాల్ గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ గారు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# తెలంగాణలో ఉద్రిక్తత

**మొదటిపేజీ తరువాయి**

టెండర్లలో అవినీతి అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలు తీవ్ర దుమారం రేపాయి. రైతాంగానికి ప్రభుత్వం చేసిన సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.ఆ సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. తాను చర్చకు సిద్ధమనీ, స్థలం, తేదీ చెప్పాలని ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర అప్పు రూ.3.50 లక్షల కోట్లని ప్రకటించారు. దీనిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర అప్పులపై గణాంకాలతో సహా చెప్పేందుకు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు వస్తానని అన్నారు. ఇంకోవైపు గురుకుల విద్యాసంస్థల టెండర్లలో రూ.రెండు వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.

దీన్ని సవాల్ చేస్తూ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజహరుద్దీన్ గురువారం ఉదయం 10 గంటలకే గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఇదే సమయంలో తెలంగాణ భవన్‌కు కేటీఆర్, హరీశ్‌రావు వచ్చారు. అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. పూర్తి వివరాలతో ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాకుండా మాజీమంత్రి హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు వచ్చేందుకు యత్నించారు. కారులో కూర్చొగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రులేమో రమ్మంటారు, పోలీసులేమో గన్‌పార్క్ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అదే సమయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్‌లకు ఆయన ఫోన్ చేశారు. వారు లిఫ్ట్ చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కారులో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో దిగి నడుకుంటూ వెళ్లేందుకు యత్నించారు.

దీంతో పోలీసులు హరీశ్‌రావు, ఇతర నాయకులను అడ్డుకుని అరెస్టు చేశారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు



తరలించారు. హరీశ్‌రావును మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఇంకోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ వేచి చూశారు. అయితే జూపల్లి కృష్ణారావు గన్‌పార్క్ వద్దకు వెళ్లారు. గన్‌పార్క్ వద్దకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ అక్కడికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. నా మాటలకు కట్టుబడి ఉన్నా : జూపల్లికేసీఆర్ హయాంలో రాష్ట్ర అప్పులపై తన మాటలకు కట్టుబడి ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.7.30 లక్షల కోట్లని వివరించారు. ఈ అప్పునకు సంబంధించిన గణాంకాలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు.గురుకుల టెండర్లలో అవినీతి జరగలేదు : అడ్లూరి, పొన్నంగురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి జరగలేదని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ అన్నారు. అవినీతి జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా రెడీ, అవసరమైతే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియను అధికారులు నిర్వహించారని వివరించారు. దీన్ని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఉండగా ఫోన్ కాల్‌కు స్పందించలేదనీ, పిరికివాళ్లమని అనడం హాస్యాస్పదమని చెప్పారు. సీఎంకు దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి : కేటీఆర్ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తొడగొట్టి తోకముడిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్‌లో కుర్చీ వేసి మూడు గంటలు వేచి చూసినా రాకుండా పారిపోయారని విమర్శించారు. తాము గన్‌పార్క్ వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుని డ్రామాలు ఆడారని అన్నారు. తమతో చర్చించే దమ్ము వారికి లేదన్నారు. హరీశ్‌రావు, ఇతర నేతల్ని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యలపై చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను పెట్టాలని డిమాండ్ చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు సహించబోరని అన్నారు.జూపల్లి రాజీనామా చేయాలి : హరీశ్‌రావుఈ ప్రభుత్వం సవాళ్లు చేసి చివరకు తోకముడిచిందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు.

మంత్రులు గోల్ కొడతామనుకుని సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు అయ్యిందని ఆరోపిస్తూ తెలంగాణ భవన్‌కు వస్తానని సవాల్ విసిరారని అన్నారు. కేటీఆర్, తాను తెలంగాణ భవన్‌లో ఉంటే చర్చకు రాలేదన్నారు. పాలమూరు పౌరుషం ఉంటే జూపల్లి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిన్న రూ.ఎనిమిది లక్షల కోట్లనీ, ఇప్పుడు రూ.ఏడు లక్షల కోట్ల అప్పు అంటున్నారని విమర్శించారు. గురుకుల టెండర్లలో అవకతవకలు జరిగాయన్నారు. అవినీతి చేసినందుకే పోలీసులను అడ్డుపెట్టుకుని మంత్రులు తప్పించుకున్నారని అన్నారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడూతూ రాష్ట్రంలో సర్కారు నడవడం లేదనీ, సర్కర్ నడుపుతున్నారని విమర్శించారు.

# వీబీజీరాంజీ లో చేరుతున్నాం

## సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

హైదరాబాద్,**జులై 02 ఆంధ్ర ప్రగతి**తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినేట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్–ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు , నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి గాను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం భూములను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్మాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అలాగే, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంత్రివర్గం తీర్మానించింది.

గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం దీనిపై సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయపడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

# సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారు

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు.

ముఖ్యమంత్రి నివాసానికి, డీజీపీ, హోంమంత్రి కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని జగన్ అన్నారు. "సీఐని కమిషనర్, కమిషనర్‌ను డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్నారు. ఇది ఒక ప్రొటెక్షన్ రాకెట్‌లా నడుస్తోంది" అని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయపరమైన సహాయంతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని జగన్ స్పష్టం చేశారు.

# ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

జరిగాయి. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, సుసంపన్నమైన, నిబంధనల ఆధారిత ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణం భారత్, జపాన్ ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్, జపాన్ కూడా ఉన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే దేశాలుగా రెండు దేశాలు కలిసి అనేక కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక పురోగతి మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రధాని మోడీ తనను 'అందమైన చెల్లెలు'గా సంబోధించడం సంతోషంగా అనిపించిందని తకాయిచి చెప్పారు. భారత్‌తో జపాన్‌కు ఉన్న ప్రత్యేక సంబంధాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని అన్నారు. ఇటీవల తాము నవీకరించిన "ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్" ( ఎఫ్ ఓఐపీ) విధానానికి అనుగుణంగా భారత్‌తో వ్యూహాత్మక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.రక్షణ రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం మరింత పెరగనుందని జపాన్ ప్రధాని తకాయిచి తెలిపారు. జపాన్ రక్షణ దళాలు, భారత నౌకాదళం కలిసి సంయుక్త విన్యాసాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే ఈ ఏడాది ముగిసేలోపు భారత్– జపాన్ విదేశాంగ, రక్షణ మంత్రుల 2+2 సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ)లో భారత్ సభ్యత్వానికి జపాన్ మద్దతు కొనసాగుతుందని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక రంగాల్లో అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. భారత భూగర్భ సర్వే సంస్థ, జపాన్ ఆర్గనైజేషన్ ఫర్ మెటల్స్ అండ్ ఎనర్జీ సెక్యూరిటీ మధ్య భూగర్భ శాస్త్రం, కీలక ఖనిజాల అన్వేషణలో సహకారానికి సంబంధించి అవగాహనా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజ వనరుల గుర్తింపు, అన్వేషణలో ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. అదే విధంగా ఔషధాలు, వైద్య పరికరాల రంగంలో సహకారం పెంపునకు మరో అవగాహన ఒప్పందం కుదిరింది.

అలాగే భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖల మధ్య బ్యాటరీల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సంబంధించి మరో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ, స్వచ్ఛ ఇంధన రంగానికి ఇవి దోహదపడనున్నాయి. ఇక సహకార మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక శాఖలతో కలిసి బయోగ్యాస్, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి, వినియోగాన్ని విస్తరించేందుకూ అవగాహనా ఒప్పందం కుదిరింది. అయితే ఇంధన భద్రత, గ్రామీణాభివృద్ధి, సుస్థిర రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఈ సహకారం ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ద్వైపాక్షిక సమావేశానికి ముందు జపాన్ ప్రధానికి రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం లభించింది. అధికారిక స్వాగత కార్యక్రమంలో ప్రధాని మోడీ తన మంత్రివర్గ సహచరులు, ఇతర ఉన్నతాధికారులను జపాన్ ప్రధానికి పరిచయం చేశారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. పరస్పర విశ్వాసం ఆధారంగా ఏర్పడిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్టు అధికారులు తెలిపారు.

# రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ జులై 02ఆంధ్ర ప్రగతి**

వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు.గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

# ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త

## శ్రీసిటీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్

**తిరుపతిజులై 02 ఆంధ్ర ప్రగతి**

తమ ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా కఠినమైన బాస్ (టఫ్ బాస్) అని, ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు తమను నిరంతరం పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలన్న బలమైన ఆకాంక్షతో ఆయన పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా తామంతా అదే వేగంతో పనిచేయాల్సి వస్తోందని అన్నారు. గురువారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని (ఎస్ఐయూ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను వివరించారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "దేశ ఆర్థికాభివృద్ధిలో మన రాష్ట్రం ముందుండాలి. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 220 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనిని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వస్తున్న నూతన విద్యా విధానం, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ విద్యా వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొస్తున్నాయని కొనియాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నారని, ఒక రాష్ట్రం మంచి పని చేస్తే మిగతా రాష్ట్రాలు పోటీపడతాయని ఆయన నమ్ముతారని లోకేశ్ తెలిపారు.

**ఏపీ యువతకు వరం శ్రీసిటీ యూనివర్సిటీ**

శ్రీసిటీలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన వ్యవస్థాపకులు శ్రీని రాజు, రవీంద్ర సన్నారెడ్డిలను లోకేష్ అభినందించారు. ఇది కేవలం ఒక యూనివర్సిటీ ప్రారంభోత్సవం కాదని, ఉన్నత విద్యపై సరికొత్త ఆలోచనా విధానానికి పునాది అని అభివర్ణించారు.

"ఒక ఐడియాను వాస్తవరూపంలోకి తెచ్చిన శ్రీని రాజు గారికి నా అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు ఒక పెద్ద గిఫ్ట్. ప్రస్తుతం 5,000 మంది విద్యార్థులతో ప్రారంభమవుతున్నా, భవిష్యత్తులో ఈ సంఖ్య కొన్ని రెట్లు పెరుగుతుందన్న నమ్మకం నాకుంది" అని ఆయన అన్నారు. కేవలం డిగ్రీలు ఇవ్వడమే కాకుండా, సమాజంలో ఎలాంటి మార్పు తీసుకొస్తున్నామనే దానిపైనే యూనివర్సిటీల విలువ ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.భారతదేశంలో ఉన్నత విద్యలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కి చెప్పారు. శ్రీసిటీ యూనివర్సిటీలో ప్రవేశపెట్టిన 'వర్క్–స్టడీ' మోడల్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని తాను 'లెగ్' మోడల్ అని పిలుస్తానని, అంటే నేర్చుకుంటూ, సంపాదిస్తూ, పట్టభద్రులు కావడమని వివరించారు. "డిగ్రీ రాగానే చదువు ఆగిపోకూడదు. జీవితాంతం నేర్చుకోవడం అక్కడే మొదలవుతుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# విబిజీ రాంజీ ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగు

..జిల్లాలో పకడ్బందీగా విబిజి రాంజి అమలు.

..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

..వేతన దారులకు 125 రోజులు పని దినాలు.

..ఎమ్మెల్యే గౌరు చరిత.



**ఆంధ్ర ప్రగతి పాణ్యం, జులై 2:**
విబిజీ రాంజీ ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.
గురువారం పాణ్యం మండలంలోని మార్కెట్ యార్డు నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎమ్మెల్యే గౌరు చరిత లు విబిజి రామ్ జి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే మంచి ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విబిజి రాంజీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మంది పేదలకు ఉపాధి కలుగుతోందన్నారు.
నంద్యాల జిల్లాలో ఎండనకా వాననకా కష్టపడి పనిచేస్తున్న 2.50 లక్షల మంది ఉపాధి శ్రామికులు ఉన్నారని వీరు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, పొలాల్లో గట్లు వేయడం వాగులను క్లియర్ చేయడం చెక్ డ్యాముల్లో భూగర్భ జలాలు పెంచడం లాంటి ఎన్నో మంచి పనులు చేయడం వల్ల నంద్యాల జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.
చెక్ డ్యాముల అభివృద్ధితో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. విబిజి రాంజీ ద్వారా100 రోజుల నుంచి ప్రస్తుతం 125 రోజుల పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% వాటాతో కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. వేతనాలు సమయానికి వచ్చేటట్లుగా వి బి జి రామ్ జి చట్టం వర్తిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎలాంటి పనులు కావాలో ప్రజలు గ్రామసభల ద్వారా అడిగినట్లయితే గ్రామ సభ తీర్మానం చేసి ఆ పనులు చేపట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యత జిల్లా కలెక్టర్ మరియు డ్వామా పిడి, ఎంపీడీవో ఈ ముగ్గురి పర్యవేక్షణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పేదలకు పనులు కల్పించడం జరుగుతుందన్నారు.
ఈ పథకం ద్వారా గ్రామాలలో పైలట్ ప్రాజెక్ట్ గా మొదట రోడ్లు వేయడం జరుగుతుంది. అలాగే రైతుల అభ్యర్థనల మేరకు పొలాల్లో రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని మన జిల్లాను మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.
అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ..గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రస్తుతం విబిజి రాంజీ గా మార్చి పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా చేపడుతున్న పనులు నంద్యాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు.
గ్రామాల అభివృద్ధికి సంబంధించి గ్రామ సభలో మీరు ఏ పని కావాలో కోరినట్లయితే అది మండల పరిషత్ కు వెళుతుంది వారు 14 రోజులలో ఆమోదించిన తర్వాత ఆ పని మనం చేసుకోవచ్చున్నారు.
కొత్త పనులు కావాలంటే మండల పరిషత్ జిల్లా పరిషత్ ద్వారా ఆమోదింప చేసుకోవచ్చున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ నిర్దేశించిన కొలతల ప్రకారం ఇకనుంచి వేతన దారునికి 312 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు.
ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే మార్కెట్ యార్డ్ ఆవరణంలో మొక్కలు నాటారు.





జిల్లాలోని ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి రఘురాం, డ్వామా పిడి సూర్యనారాయణ, వి బి జి రాంజీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలి

..ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఓటర్లలో రోజుకు కనీసం 10 శాతం మేర డిజిటైజేషన్ పురోగతి నమోదు చేయాలి.-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 02:** అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జమ్మిచెట్టు వద్ద ఉన్న గడ్డ వీధి 244, 245 పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న డిజిటైజేషన్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా బూత్ లెవల్ అధికారులు సేకరించిన సమాచారాన్ని యాప్ లో డిజిటైజేషన్ చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా డిజిటైజేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఓటర్లలో రోజుకు కనీసం 10 శాతం మేర డిజిటైజేషన్ పురోగతి నమోదు చేయాలన్నారు. ఓటర్లు అందుబాటులో ఉండే సమయాల్లో ఇంటింటికీ వెళ్లి అవసరమైన ఫోటోలు, పత్రాలు, ఇతర వివరాలను సేకరించి, డిజిటైజేషన్ కు సంబంధించి నిర్ణీత లక్ష్యాన్ని సాధించాలన్నారు. నిర్దేశించిన గడువు లోపు 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ లెవల్ ఆఫీసర్లతో సమన్వయంతో వ్యవహరించి క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అనంతరం కలెక్టర్ స్వయంగా బి ఎల్ ఓ యాప్ లో ఎన్యూమరేషన్ ఫార్మ్ ను డిజిటైజేషన్ చేశారు.కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎన్నికల విభాగం సూపరిశీటెండెంట్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో ఈనెల 03 న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'.

..వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ స్వీకరణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 02:**
జిల్లా పరిపాలన చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 03వ తేదీన మహానంది మండలంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానంది మండలంలోని కమ్మ సత్రం హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మహానంది మండల ప్రజలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. మహానంది మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రిజిష్ట్రేషన్ సేవా కేంద్రాలను రద్దు చేయాలనే జిఓను ఉపసంహరించుకోవాలి.

-స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 02:**రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను రద్దు చేయాలనే జిఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు రమేష్, ఫారుక్, మాలిక్, విశ్వనాథం, శివరాం తదితరులు ఇంచార్జ్ రిజిస్ట్రార్ గోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వము వారు ప్రవేశ పెట్టబోవు రిజిష్ట్రేషన్ సేవా కేంద్రాలను రద్దు చేయాలని, ఇందుకై ప్రతిపాదించిన జిఓ ఎంఎస్ నెంబర్.396 ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వీటి వల్ల ప్రజల ఆస్తులకు భద్రత లోపించడమే గాక అనేక సంవత్సరాలుగా దస్తావేజులు వ్రాసుకుంటూ దస్తావేజు లేఖరులుగా, స్టాంపు వెండర్లుగా జీవనాన్ని కొనసాగిస్తున్న దస్తావేజు లేఖర్ల జీవనోపాధికి విఘాతము కలిగే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయములను గురించి రాష్ట్ర వ్యాప్తంగా వున్న దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు నిరసనలు చేస్తున్న నేపధ్యములో ఈ రోజు నుండి నంద్యాల జిల్లా పరిధి దస్తావేజులేఖరులు స్టాంపు వెండర్లు శాంతియుతంగా నిరసనలు ప్రారభించారని, కావున ఈ విషయాలను ప్రభుత్వము వారు దృష్టిలో వుంచుకొని జిఓ ఎంఎస్ నెంబర్ 396ను రద్దు చేయాలని, రిజిష్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరము కాకుండా ఆపాలని, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలని, రిజిష్ట్రేషన్ డిపార్టుమెంటునే నమ్ముకొని దస్తావేజు లేఖరులుగా, స్టాంపు వెండర్లుగా కొనసాగుతూ కుటుంబాలను పోషించుకుంటున్న మమ్ములను మా కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్టాంప్ రైటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించిన.. శ్రీలక్ష్మి ఇంగ్లీష్ మీడియం స్కూల్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 02:** జిల్లాలో గుర్తింపు పొందిన బీపీఎల్ జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు 202627 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాలు మేరకు నంద్యాల లోని శ్రీలక్ష్మి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ అమలు అమలు చేసిన సందర్భంగా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యా రంగంలో విశేష ఫలితాలు సాధిస్తున్న స్కూల్ యాజమాన్యానికి జర్నలిస్టులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 2025 పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన విద్యార్థిని, అనంతరం ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ రాష్ట్ర రెండో స్థానం కైవసం చేసుకోవడం స్కూల్ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు శ్రీ లక్ష్మీ స్కూల్ లోనే చదివిన విద్యార్థిని ఈ ఘనత సాధించడం పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచిందని తెలిపారు. విద్యార్థి విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తిరుపతిలో రాష్ట్రవ్యాప్త జిల్లా బీజేపీ అధ్యక్షులు, ఇంచార్జిల కార్యవర్గ సమావేశం

-- పాల్గొన్న నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, ఇంచార్జ్ పార్థసారథి, కో ఇంచార్జ్ కాశీ విశ్వనాథ్






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 02:**
బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ఒక సంవత్సరం పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో రాష్ట్రవ్యాప్త జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇంచార్జిల విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే ఏకైక లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి శ్రమించాలని రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. పదవీ కాలం ఏడాది పూర్తయిన సందర్భంగా సమావేశంలో మాధవ్‌ను ముఖ్య నేతలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

**హాజరైన నంద్యాల జిల్లా బృందం**

ఈ ఉన్నత స్థాయి కార్యవర్గ సమావేశంలో నంద్యాల జిల్లా బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జిల్లా ఇంచార్జి పార్థసారథి , కో-ఇంచార్జి కాశీ విశ్వనాథ్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

**ఎన్నికల కార్యాచరణ నివేదన**

నంద్యాల జిల్లాలో పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణను జిల్లా నేతలు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి సమగ్రంగా నివేదించారు. రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు నంద్యాల జిల్లాలో పార్టీని అగ్రపథాన నిలిపేందుకు, రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా శ్రేణులన్నింటినీ సమాయత్తం చేస్తున్నామని, ఇందుకోసం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతామని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి భరోసా ఇచ్చారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## డోన్ టౌన్ సిఐ ఇంతియాజ్ బాషను సస్పెండ్ చేయాలి.

**నంద్యాల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కి వినతి పత్రం ఇచ్చిన సిపిఐ నాయకులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 02:**డోన్ సిపిఐ మండల కార్యదర్శి నారాయణ పై దాడి చేసినటువంటి డోన్ టౌన్ సిఐ ఇంతియాజ్ భాష పై చర్యలు తీసుకోవాలని ఈరోజు నంద్యాలకు విచ్చేసినటువంటి ఎస్సీ కమిషన్ చైర్మన్ కి వినతిపత్రం అందజేసిన సిపిఐ నాయకులు. స్పందించి తక్షణమే డోన్ సీఐ ఇంతియాజ్ భాష పై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పి కి ఫోన్ చేసి చెప్పినటువంటి ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ఈ కార్యక్రమంలో డోన్ మండల పార్టీ కార్యదర్శి బి.నారాయణ, నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు,జిల్లా సహాయ కార్యదర్శి పృధ్వి కుమార్, డోన్ మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మనోహర్,నంద్యాల పట్టణ కార్యదర్శి ధనుంజయ్, సిపిఐ నాయకులు శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర ఉమ్రా యాత్రను ముగించుకున్న ఎన్ఎండీ ఫిరోజ్ కి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 02:**నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ గారు పవిత్ర ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి నంద్యాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నంద్యాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ గారిని వారి నంద్యాల కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ వారు ఎన్ఎండీ ఫిరోజ్ గారిని శాలువాతో ఘనంగా సన్మానించి, తమ ఆత్మీయతను చాటుకున్నారు. అల్లాహ్ కృపతో ఎన్ఎండీ ఫిరోజ్ గారు సంపూర్ణ ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో ఉండాలని , మరిన్ని ఉన్నత పదవులను అధిరోహిస్తూ ప్రజలకు మరింత విశేష సేవలందించాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వికాస్ స్కూల్ వలి, రాయల్ స్కూల్ ఇసాక్ వలి, నేషనల్ స్కూల్ ఖాజా హుస్సేన్ , సాయివాణి హుస్సేన్ భాష, నలంద ఉత్తేజ్, అభ్యుదయ వలి, అభ్యుదయ స్కూల్ రవి, నవభారత్ స్కూల్ మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా చేయకపోతే చర్యలు తప్పవు.

### ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 02:** గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా చేయకపోతే చర్యలు తప్పవు అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి హెచ్చరించారు.
గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో డిప్యూటీ ఎంపిడిఓ లు, ఈ వో ఆర్డీ లు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిర్వహణ విధులను డిప్యూటీ ఎంపిడిఓ లు, ఈ వో ఆర్డీ లు, పంచాయతీ సెక్రటరీలతో సక్రమంగా నిర్వహించడం లేదని కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా కూడా సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవు అని కలెక్టర్ హెచ్చరించారు.ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని, పారిశుధ్యం, తాగునీటి సరఫరా బాగుండాలని కలెక్టర్ ఆదేశించారు.. ఒంఘూఒ షెడ్ లు సరిగా పని చేసేలా చూడాలన్నారు..వర్మీ కంపోస్ట్ తయారు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డిపిఓ భాస్కర్ పాల్గొన్నారు.



## నంద్యాల పట్టణంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ల ప్రారంభం.

### ..ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్ఎండి ఫిరోజ్ పిలుపు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 02:**నంద్యాల పట్టణంలోని 3 వ వార్డు నడిగడ్డ మరియు 25 వ వార్డు సాయిబాబా నగర్ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ వార్డు కమిటీల ఆధ్వర్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై, హెల్ప్ డెస్క్‌లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ "ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వంటిదని ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే శక్తి ఓటుకు మాత్రమే ఉందని " అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ పేరును నమోదు చేసుకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పట్టణ శివార్లలో నివసించే పేదలు, నిరక్షరాస్యులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు, వారికి తోడ్పాటును అందించేందుకు ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. వార్డు ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఇక్బాల్, వేద సాయి, గోవింద నాయుడు, సుధాకర్, బాబా, అబ్దుల్ వారిష్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓటు నమోదులో నిర్లక్ష్యం వద్దు.

### ..సర్వే ఫారమ్‌ల పూర్తికి పది రోజుల గడువు.

### ..నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 02:**
నంద్యాల టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో జరుగుతున్న సర్వే ప్రక్రియ సజావుగా సాగుతున్నప్పటికీ, ఫారమ్‌లను నింపిన తర్వాత చాలామంది వాటిని వెనక్కి ఇవ్వడం లేదని అన్నారు. నంద్యాల ప్రజలందరూ తప్పనిసరిగా ఫారమ్‌లను నింపి సంబంధిత అధికారులకు తిరిగి అందజేయాలని కోరారు. ఫారమ్ నింపే విషయంలో ఎటువంటి సందేహాలు ఉన్నా సరే, అక్కడ అందుబాటులో ఉన్న బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) మరియు బూత్ లెవల్ ఏజెంట్లను (బిఎల్ఎ) లను సంప్రదించి, ఎటువంటి తప్పులు లేకుండా ఫారమ్‌లను పూర్తి చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెల 14వ తేదీలోపు పూర్తి చేయాలని, ప్రతి ఓటు చాలా కీలకమైనదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఇన్-ఛార్జ్‌లు అందరూ కూడా యాక్టివ్‌గా ఉండి, ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లను నింపేలా చూడాలని ఆదేశించారు. ఇది మనందరి భవిష్యత్తు కోసం చేస్తున్న పని కాబట్టి, ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఓటరు ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా చూడాలన్నారు. రాబోయే పది రోజుల పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్రాంతి లేకుండా, అంకితభావంతో ఈ పనిని పూర్తి చేయాలని ఎన్ఎండీ ఫిరోజ్ పిలుపునిచ్చారు. తానూ స్వయంగా రేపటి నుంచి పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పర్యవేక్షిస్తానని తెలిపారు.

## బి-సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన శ్రీ ఆర్. రంగస్వామిని అభినందన. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ జూలై 02:**
కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్. రంగస్వామి బి-సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది జిల్లా పోలీసు కార్యాలయం కర్నూలుకు బదిలీ అయిన సందర్భంగా గురువారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆర్. రంగస్వామికి అభినందనలు తెలియజేసి నూతన బాధ్యతల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## ఈఏపీసెట్‌లో ఎస్.డి.ఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం..!

### ..టాప్ ర్యాంకులతో మరోసారి సత్తా చాటిన నంద్యాల ఎస్డిఆర్ ఆకాంక్ష విద్యాసంస్థ.

### ..500 లోపు 5 ర్యాంకులు. -1,000 లోపు 8. -5,000 లోపు 22. -10,000 లోపు 38 ర్యాంకులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల,జూలై 02:**ఈఏపీసెట్2026 ఫలితాల్లో నంద్యాల జిల్లాలోని ఆకాంక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరోసారి తమ సత్తా చాటారు.రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత ఇనుమడింపజేశారు.ఈ ఫలితాల్లో 500 లోపు 5 ర్యాంకులు,1,000 లోపు 8 ర్యాంకులు,5,000 లోపు 22 ర్యాంకులు,10,000 లోపు 38 ర్యాంకులు సాధించడం విశేషం. విద్యార్థుల్లో బి.నవత (343),ఫైక్ సజ్జాద్ తాసీన్ (356),జి.ఒలివా (452), ఫైక్ సనా (470),ఎ.ముంజాలత (488),ఎస్.కీర్తి పద్మజ (664),బి.బాలి రెడ్డి (860),జి.జాన్సన్ రెడ్డి (908) రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.కళాశాల చైర్మన్ శనివారపు కొండారెడ్డి మాట్లాడుతూ,విద్యార్థుల కృషి,తల్లిదండ్రుల విశ్వాసం,అధ్యాపకుల అంకితభావం కలిసి ఈ అద్భుత విజయానికి కారణమయ్యాయని తెలిపారు.పోటీ పరీక్షలకు అనుగుణంగా రూపొందించిన ప్రత్యేక అకడమిక్ ప్రణాళిక,అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం,నిరంతర గ్రాండ్ టెస్టులు,డిజిటల్ క్లాస్‌రూమ్‌లు,వ్యక్తిగత పర్యవేక్షణ,సందేహ నివృత్తి తరగతులు వంటి అంశాలే ఈ విజయాలకు బాటలు వేశాయని పేర్కొన్నారు.విద్యార్థులను కేవలం పరీక్షలకు మాత్రమే కాకుండా ఉన్నత విద్యలో రాణించేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమనినాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.రానున్న విద్యా సంవత్సరాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యం, మరియు అధ్యాపకులు అభినందించారు. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ,కళాశాల అందిస్తున్న నాణ్యమైన విద్య,క్రమబద్ధమైన శిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.విద్యార్థుల విజయంతో కళాశాల ఆవరణలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# కంచంలో విషం..

## రేపటి తరంపై క్యాన్సర్ పంజా!



**పొలం నుంచి పళ్లెం వరకు పెరుగుతున్న రసాయనాల ముప్పు...**

**అధిక దిగుబడుల వెనుక దాగిన ఆరోగ్య సంక్షోభం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 02:**
“అన్నం పరబ్రహ్మ స్వరూపం“ అని మన సంస్కృతి చెబుతుంది. అదే అన్నం నేడు అనేక కుటుంబాల్లో ఆందోళనకు కారణమవుతోంది. మన పళ్లెంలోకి చేరేది నిజంగా పోషకాహారమా? లేక నెమ్మదిగా శరీరంలో చేరి క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే రసాయన అవశేషాలా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది.
పొలం నుంచి పళ్లెం వరకు చేరే ఆహారంలో పెరుగుతున్న రసాయన అవశేషాలు ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దిగుబడుల పెరుగుదల అవసరమే. కానీ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సాధించే అభివృద్ధి శాశ్వతం కాదు. అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం ఎఎ పెరగడం వాస్తవం. అయితే వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో, సూచించిన మోతాదుల్లో, సరైన సమయంలో వినియోగించకపోతే పంటల నాణ్యత దెబ్బతినడమే కాదు, ప్రజారోగ్యంపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రైతు ఎక్కువ పండించాలి... దేశానికి ఆహారం సమృద్ధిగా అందాలి.ట కానీ ఆ ఆహారం సురక్షితంగా ఉండేలా చూడటం రైతు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వం, వినియోగదారులు అందరి ఉమ్మడి బాధ్యత.

### చాపకింద నీరులా విస్తరిస్తున్న క్యాన్సర్ ముప్పు

భారత జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ 2024 నివేదిక ప్రకారం దేశంలో 2024లో సుమారు 14.13 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. 2026 నాటికి ఈ సంఖ్య 15.6 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది. పొగాకు, మద్యపానం, కాలుష్యం, జన్యుపరమైన కారణాలు, ఊబకాయం, జీవనశైలి వంటి అనేక అంశాలు క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు. వీటితో పాటు, అనుమతించిన పరిమితి కంటే ఎక్కువగా ఉన్న పురుగుమందుల అవశేషాలు దీర్ఘకాలం ఆహారం ద్వారా శరీరంలోకి చేరితే ఆరోగ్యపరమైన ప్రమాదం పెరిగే అవకాశం ఉందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే ప్రతి పురుగుమందే క్యాన్సర్‌కు ప్రత్యక్ష కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు. సమస్య రసాయనాల్లో కంటే వాటి దుర్వినియోగంలోనే ఎక్కువగా ఉంది.

### పంజాబ్ ‘క్యాన్సర్ ట్రైన్‘... దేశానికి ఒక హెచ్చరిక

పంజాబ్‌లోని మాల్వా ప్రాంతం నుంచి రాజస్థాన్‌లోని బీకానేర్ క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లే రైలును స్థానికులు “క్యాన్సర్ ట్రైన్“గా పిలుస్తారు. భూగర్భ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాలు, జీవనశైలి మార్పులు, రసాయనాల అధిక వినియోగం వంటి అనేక కారణాలు కలిసి ఈ పరిస్థితికి దారితీసినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఒక్క పురుగుమందులనే ఇందుకు కారణమని చెప్పలేకపోయినా, ఆహార భద్రతపై ఇది దేశానికి గట్టి హెచ్చరిక.

### వెయిటింగ్ పీరియడ్ పాటించడం తప్పనిసరి

ప్రతి పురుగుమందుకు ప్రీ-హార్వెస్ట్ ఇంటర్వెల్ లేదా వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. పిచికారీ చేసిన తర్వాత ఎన్ని రోజులకు పంటష కోయాలో మందు లేబుల్‌పై స్పష్టంగా పేర్కొంటారు. ఈ వ్యవధిని పాటించకపోతే పంటలో రసాయన అవశేషాలు పెరిగే అవకాశం ఉంటుంది.
మనం తినే పండ్లు, కూరగాయలు, ధాన్యాల్లో అనుమతించిన పరిమితిని మించిన రసాయన అవశేషాలు ఉంటే, అది ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారే అవకాశం ఉంది.

### పొలాల్లో పెరుగుతున్న ఆందోళనకర ధోరణులు

**క్షేత్రస్థాయిలో తరచూ కనిపిస్తున్న కొన్ని సమస్యలు:**

- సిఫారసు చేసిన మోతాదుకంటే ఎక్కువగా పురుగుమందులు వాడటం.
- ఒకే ట్యాంకులో మూడు నుంచి ఐదు రకాల మందులు కలిపి పిచికారీ చేయడం.
- పిచికారీ చేసిన వెంటనే పంటను కోసి మార్కెట్‌కు తరలించడం.
- ఒకే రసాయనాన్ని పదేపదే వాడటంతో పురుగుల్లో నిరోధక శక్తి పెరగడం.
- గడ్డిమందులను విరివిగా వాడడం
- నకిలీ, నాసిరకం మందుల వల్ల రైతులు నష్టపోవడం.

### రైతు బాధితుడు... బాధ్యుడు కాదు

ఈ సమస్యకు రైతును మాత్రమే బాధ్యుడిగా చూపడం సరైంది కాదు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కొత్త తెగుళ్లు, పురుగుల్లో పెరుగుతున్న నిరోధక శక్తి, అధిక సాగు ఖర్చులు, నకిలీ మందులు, సరైన సాంకేతిక సలహాల కొరత రైతును రసాయనాలపై ఆధారపడేలా చేస్తున్నాయి. ఏ రైతూ ప్రజలకు విషం పెట్టాలనే ఉద్దేశంతో పంట సాగు చేయడు.

### ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు

ప్రతి జిల్లాలో అవశేషాల పరీక్షా ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. నకిలీ మందులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలంలో ఉచిత శాస్త్రీయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
సమగ్ర తెగుళ్ల నివారణ విధానాలను విస్తృతంగా అమలు చేయాలి. జీవ ఎరువులు, బయోపెస్టిసైడ్లు, సహజ వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వాలి. డ్రోన్ పిచికారీకి ప్రోత్సాహకాలు అందించాలి. ప్రతి రైతుకు సురక్షిత పిచికారీ, వెయిటింగ్ పీరియడ్‌పై శిక్షణ ఇవ్వాలి. ఆహార భద్రత పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి.

### వినియోగదారుల జాగ్రత్తలూ అవసరమే

పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో బాగా కడగాలి. ఉప్పు లేదా బేకింగ్ సోడా కలిపిన నీటిలో 1520 నిమిషాలు నానబెట్టడం మంచిది. కాలానుగుణంగా పండిన స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. నమ్మకమైన వనరుల నుంచే ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలి.

### సురక్షిత ఆహారమే నిజమైన అభివృద్ధి

అధిక దిగుబడి మాత్రమే అభివృద్ధికి కొలమానం కాదు. సురక్షితమైన దిగుబడే నిజమైన అభివృద్ధి. రైతు బతకాలి. వినియోగదారుడు ఆరోగ్యంగా ఉండాలి. నేల సారవంతంగా ఉండాలి. పర్యావరణం పరిరక్షించబడాలి. ఈ నాలుగు లక్ష్యాలు కలిసినప్పుడే వ్యవసాయం స్థిరంగా ఉంటుంది.
పొలం పచ్చగా ఉండాలి. పంటలు సమృద్ధిగా పండాలి. రైతు సంతోషంగా ఉండాలి. ప్రజల పళ్లెంలోకి చేరేది పోషకాహారమే కావాలి, విషం కాదు. శాస్త్రీయ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగం, అవసరమైన మేరకే పురుగుమందులు, జీవసేద్యానికి ప్రాధాన్యంఇవే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు.
ఎందుకంటే నేడు మనం పళ్లెంలో వడ్డించేది కేవలం ఆహారం కాదు... రేపటి తరాల ఆరోగ్యం, దేశ భవిష్యత్తు. ఆ భవిష్యత్తును విషంతో కాదు, విశ్వాసంతో నిర్మించాల్సిన బాధ్యత రైతు నుంచి వినియోగదారుడి వరకు మనందరిదీ.



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

# అధిక దిగుబడులు సాధించ వచ్చు.

**..రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి .విజయ్ కుమార్.**





**ఆంధ్ర ప్రగతి కర్నూల్ జులై 02:**
ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన పంటలు, అధిక దిగుబడులతో పాటు నిరంతరాదయం పొందవచ్చు అని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి .విజయ్ కుమార్ వారు తెలిపారు. కర్నూలు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి అధ్వర్యంలో కర్నూలు జిల్లా గూడూరు, గోనెగండ్ల, దేవనకొండ మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పొలాలను సందర్శించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ, కరువు నివారణ చర్యలు మరియు రైతుల సన్నద్ధతపై సమీక్షించేందుకు గురువారం కర్నూలు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతుల పొలాలను సందర్శించిన ఆయన, ప్రధాన పంటలు, అంతర పంటలు, బహుళ పంటల విధానాలు, తేమ సంరక్షణ చర్యలు, జీవవైవిధ్య ఆధారిత సాగు పద్ధతులు తదితర అంశాలపై రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించారు. రైతులు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించి, ఎల్ నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. పర్యటనలో భాగంగా గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమైన శ్రీ విజయకుమార్, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలులో వారి పాత్ర, గ్రామ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు, తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో మరింత విస్తరించేందుకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న పండ్ల తోటలు, పూల తోటలను సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న వివిధ ప్రకృతి వ్యవసాయ నమూనాలను పరిశీలించారు. రైతుల అనుభవాలను తెలుసుకుని, ఆయా నమూనాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సూచనలు చేశారు. అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారం, చేపడుతున్న కార్యక్రమాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృత స్థాయిలో రైతులకు చేరవేసేందుకు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ సిబ్బంది అందరూ మోడల్స్ వేసి రైతులతో వేయించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పాటించి పండించిన ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా, దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బతినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన పంటలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ పూర్తిస్థాయి అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రధాన పంటతో పాటు అనుబంధ పంటలు వైవిద్య పంటలు వంటి రక రకాల పంటలు వేసుకొని ఆదాయంతోపాటు నేలలో జీవపదార్థం, భూసారం పెరుగుతుంది. మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలని నేలలో ఉంటాయని రైతులకు అర్థమయ్యే విధంగా సిబ్బంది తెలియజేయాలిని అన్నారు. పలు పంటల సాగు చేయడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. జీవవైవిద్యం పెరిగి మొక్కలకు పోషకాల లబ్బితా పెరుగుతుంది. చీడపీడలు, తెగుళ్ళను తట్టుకోగలుగుతుంది. నేల కోతను అరికడుతుందని నేలగుల్ల వారి వానపావుల వృద్ధి జరుగుతుందని తెలిపారు. అలాగే విత్తన గుళికల తయారీ విధానం, వాటి లాభాల గురించి తెలిపారు. నేలను కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు స్థిరమైన, సుస్థిరమైన, సజీవనరుగా అందించడం మన అందరి బాధ్యత. కానీ ఇప్పుడు మనం స్వయం కృతపరాధంతో నేల ఆరోగ్యం బాగా దెబ్బతింటుందని హెచ్చరిస్తునారని అన్నారు. నేలపై మానవజాతి మనుగడ కొనసాగాలంటే ప్రకృతి వనరుల విధ్వాంసాన్ని ఆపాలని సూచిస్తున్నారు. భూమిని కాపాడటమే కాదు, భూమి మీద వున్న ఉనికిని కాపాడడం అందరి బాధ్యతఅన్నారు. నేలలో నిక్షేపాలు అపరిమితం కాదు పరిమితమైనవి. నేలను కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు స్థిరమైన, సుస్థిరమైన, సజీవనరుగా అందించడం మన అందరి బాధ్యత అన్నారు. కావున భవిష్యత్తు తరాలను కాపాడుకోవడం కోసం విషరహిత స్థాపన అందరి బాధ్యత. మట్టి ఆరోగ్యమే మనిషి ఆరోగ్యమనే తాత్వికతతో వ్యవసాయాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి పర్యావరణంగా స్థిరమైనదిగా తయారు చేయడానికి, రైతుల జీవన ప్రమాణాలు పెంచడానికి, నేల, నీరు, వంటి సహజ వనరులను ఉపయోగించి మంచి ఫలితాలు సాధించడానికి ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలను సాగు చేసి పండించినటువంటి ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బ తినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఏ. రామకృష్ణ రెడ్డి, సీనియర్ థిమాటిక్ లీడ్ చక్రాల చంద్ర శేఖర్, సీనియర్ కన్సల్టెంట్ రాజేశ్వర్, జిల్లా కన్సల్టెంట్ వి. లక్ష్మయ్య సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబంది, రైతులు పాల్గొన్నారు.

## పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

**కేబినేట్ నిర్ణయానికి అనుగుణంగా జివో జారీ**

**అమరావతి,జూలై2ఆంధ్ర ప్రగతి** పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసును 60 ఏళ్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రెట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది. అలాగే, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 60 ఏళ్లకు పదవీ విరమణ పొంది తిరిగి విధుల్లో చేరేందుకు ఆసక్తి లేని ఉద్యోగులకు పాత నిబంధనల ప్రకారమే రిటైర్మెంట్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు సర్వీస్ రూల్స్‌లో అవసరమైన సవరణలు చేయాలని సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రతి సంస్థ తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అన్ని శాఖలు తమ పరిధిలోని పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీలకు వెంటనే ఉత్తర్వులను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలి

**రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పిలుపు**



**కర్నూలుఆంధ్ర ప్రగతిజూలై 2)**రాష్ట్రంలో చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ కోరారు.ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు కులం, మతంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇది ప్రతి ఓటరికి సమానంగా వర్తించే ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజలందరూ తమ ప్రాంతంలోని బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.ఓలు)కు అవసరమైన వివరాలను అందించి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ఏ ఒక్క కులానికి లేదా మతానికి మినహాయింపు కాదని, నిర్దిష్ట గడువులోగా ప్రతి ఓటరు తమ వివరాలను బి.ఎల్.ఓలకు సమర్పించాలని మంత్రి కోరారు.అధికారులు కూడా ప్రజలకు ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించి, సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి టీజీ భరత్ సూచించారు.